క్లుప్తంగా

సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ



తెనాలిఅర్బన్: పేర్ల వసంతలక్ష్మి నాల్గొవ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె తల్లిదండ్రులు లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ సభ్యులు పాదర్తి వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మిల ఆధ్వర్యంలో సత్యనారాయణటాకీస్ రోడ్డులోని మున్షీ మస్తాన్ మున్సిపల్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌కు రెండు సీలింగ్ ఫ్యాన్‌లను శనివారం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం, అయినాల మల్లేశ్వరరావు, కోనిజేటి రమేష్ కృష్ణ, ప్రధానోపాధ్యాయిని షేక్ దిల్‌బహర్, తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన



తెనాలిఅర్బన్: డెంగీ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పట్టణ మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ సూచించారు. ఐతానగర్‌లోని హయ్యర్‌పేటలో డెంగీ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరీ సెక్రటరీ సుధీర్, హెల్త్ అసిస్టెంట్‌లు షేక్ నవీద్, షేక్ రషీద్, తదితరులు పాల్గొన్నారు.

మాటలతో మస్కా కొట్టిన కేటుగాడు

ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, పర్సుతో పరారీ



మంగళగిరి: మాటలతో మస్కా కొట్టి ఓ కేటుగాడు ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్, పర్సుతో పరారీ అయిన శనివారం మంగళగిరిలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. యర్రబాలేనికి యెలిమిచర్ల దుర్గారావు ఆటోనగర్‌లోని ఓ హోటల్‌లో వాచ్‌మేన్‌గా పని చేస్తుండాడు. శుక్రవారం సాయత్రం ఓ ఆగంతకుడు అతడు వద్దకు వెళ్లాడు. మంచి బియ్యం, గోధుమపిండి, నిత్యావర సరకులు ఉన్నాయని, వాటితో పాటు మూడు లీటర్ల పెట్రోల్ రూ. వందని మాయమాటలు చెప్పాడు. అన్నీ కలిపి తక్కువ రూ. 1700 కే ఇస్తానని నమ్మబలికాడు. దుర్గారావు మాయ మాటల్ని నమ్మాడు. కుమారుడు సత్యసాయిని రమ్మని పిలిచి , ద్విచక్ర వాహనంపై ఆగంతకుడితో వెళ్లి సరుకులు తీసుకుని రావాలని చెప్పాడు. రైల్వేస్టేషన్ దగ్గరకు వెళ్లగానే ఆగంతకుడు వాహనం ఆపించి తాను ఎక్కాడు. సత్యసాయి సెల్‌ఫోన్ తీసుకుని తండ్రితో మాట్లాడుతుండగా దాన్ని లాక్కుని వాహనంపై పరారయ్యాడు. జరిగిన మోసంపై దీంతో దుర్గారావు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



తాడికొండ: మండల కేంద్రమైన తుళ్లూరులో యూటీఎఫ్ 50వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రరీ సెంటర్ వద్ద పతాకావిష్కరణ చేశారు. అనంతరం పలువురు నేతలు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యు. రాజశేఖర్, సీనియర్ నాయకులు కొండవీటి రాజయ్య, కన్వీనర్ అడివి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు అల్లంశెట్టి రఘునాథ్, మండల అధ్యక్షులు పి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి టి.భాస్కరరావు, సహాధ్యక్షులు ఇందుమతి, వి. ప్రసాద్, ఎ. కల్యాణ్, సీహెచ్. శివబాబు, బి.శివాజీ, జయలక్ష్మి, ఎస్‌టీ మున్నీ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

మంగళగిరి: నగరంలోని పలు కూడళ్లలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తామని తెలిపారు. అనుమానం ఉన్న వాహనాల్ని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసకుంటామని పేర్కొన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. రౌడీషీటర్లు భూదందాలు, అధిక వడ్డీలు వసూలు చేయడం, సెటిల్‌మెంట్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో అసాంఘిక కార్యక్రమాలను ఉపేక్షించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు.

వరాహాల స్వైర విహారం

- రోగాలకు అధిక ఆస్కారం
- జనావాసాల్లో పెరిగిన సంచారం
- వ్యాధులు ప్రబలుతాయనే ఆందోళనలో ప్రజలు
- కట్టడి చేయాలని మున్సిపల్ అధికారులకు వినతి



చంద్రబాబునాయుడు కాలనీలో పందుల సంచారం

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పందుల(వరాహాలు) స్వైర విహారం ఎక్కువైంది. గతంలో ఇదే విధంగా తెనాలి పట్టణంలో వాటి సంచారం ఎక్కువ కావటం...ప్రజల నుంచి ఫిర్యాదులు రావటంతో మున్సిపల్ అధికారులు వాటిని పట్టించి దూరప్రాంతంలో వదిలేశారు. తర్వాత ఆడిసే మరిచారు. దీంతో మరలా తెనాలిలో పందుల సంచారంపై ఫిర్యాదులు వెల్లు వెత్తుతున్నాయి. పట్టణంలో సుమారు 100కు పైగా పందులను పెంచే సామాజిక వర్గం వారు నివశిస్తుంటారు. వీరు ఒక్కొక్కరూ పదుల సంఖ్యలో పందులను పెంచుతూ ఉంటారు. గతంలో సుమారు మూడు వేల వరకు పందులు ఉన్నాయనేది అధికారుల మాట. అప్పట్లో పందులలో కొన్నింటిని పట్టించగా మరికొన్ని చనిపోవటంతో నేడు వాటి సంఖ్య కొంత తగ్గింది. ప్రస్తుతం తెనాలిలో అధికారుల లెక్కల ప్రకారం సుమారు 500 వరకు ఉండవచ్చు. వీటిని పందుల పెంపకందారులు రోడ్లపై వదిలేయటంతో అవి ఇళ్ల మధ్య సంచరిస్తూ ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. అంతేకాకుండా వాటి వల్ల కొన్ని వ్యాదులు ప్రభలే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దస్త్రాలకే పరిమితమైన షెడ్లు

తెనాలి పట్టణంలో పందుల సంచారంపై గతంలో ఎక్కువ ఫిర్యాదులు రావటంతో 2018లో అప్పటి పాలకులు, అధికారులు పందుల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఇరిగేషన్ కాల్వ కట్టపై షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే వాటిని రోడ్లపైకి రాకుండా చూసుకోవాలన్నారు. అలాకాకుండా ఎవరైన వాటిని రోడ్లపైకి వదిలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షెడ్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు షెడ్ల ఏర్పాటు దస్త్రాలకే పరిమితం అయ్యింది. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే ఇళ్ల మధ్య పందుల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మారీసు పేట మరంబజార్‌లో పందుల సంచారం

పందులను రోడ్లపై వదిలితే చర్యలు



పందుల పెంపకందారులు తమ ఇంటి పరిసరాల్లో షెడ్లను ఏర్పాటు చేసుకుని వాటిని అక్కడే సంచరించే విధంగా చూసుకోవాలి. ఇది ప్రభుత్వ నిబంధన. దానిని అమలు చేసేందుకు తెనాలి పట్టణంలోని పందుల పెంపకం దారుల వివరాలు సేకరిస్తున్నాం. రోడ్లపై వాటిని వదలొద్దనే నోటీసులు త్వరలో ఇస్తాం. అప్పటికీ వారిలో మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఆరోగ్యాధికారిణి, తెనాలి

వైఎస్సార్ సీపీ నేతల కొవ్వొత్తుల ప్రదర్శన

శిలాఫలకాలను పునఃప్రతిష్ఠించాలని డిమాండ్

తెనాలిఅర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో జరుగుతున్న శిలాఫలకాల విధ్వంసాలను అరికట్టడంతో పాటు వాటిని పునఃప్రతిష్ఠించాలని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతివనంలో ఏర్పాటు చేసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గం ఆధ్వర్యంలో శనివారం రాత్రి చినరావూరులోని రైల్వేస్టేషన్ నుంచి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. చినరావూరు సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని నేటి పాలకులు కాలరాస్తున్నారని ఆరోపించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని వెంటనే అక్కడ పునః ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొర్ర యశోద, యాతాటి అనిల్, వైఎస్సార్ సీపీ నాయకులు కుర్రా శ్రీను, దేవరపల్లి కిషోర్, అక్కిదాసు కిరణ్, మన్నవ శాంతిశ్రీ, అక్కిదాసు కిరణ్, టెక్స్ బాల, బండ్లమూడి నాని, పిల్లి ప్రేమరాజు, చిక్కాల బెన్నీ, బేతాళ కిషోర్, చుక్కా ఆనంద్, పిల్లి వీరయ్య, ఉన్నవ సాల్మన్, గుమ్మడి రవిరాజు, చుక్కా యేసురత్నం, షేక్ జాకీరా, పెదలంక వెంకటేశ్వర్లు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు



కొవ్వొత్తులతో ప్రదర్శనగా వస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

అర్హులకు ఉచిత న్యాయ సహాయం

తెనాలిరూరల్: అర్హులైన వారికి తెనాలి మండల న్యాయ సేవ కమిటీ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తారని, అవసరమైన వారు దానిని సద్వినియోగపర్చుకోవాలని ప్యానల్ న్యాయవాది అప్పల కిషోర్ తెలిపారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు ఆదేశాల మేరకు తెనాలి మండలం, కఠెవరం గ్రామంలో వితంతు సామాజిక పింఛన్లపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించి చట్ట పరిధిలో వ్యవహరించాలన్నారు. చట్టాలను ప్రజలకు చేర వేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పారా లీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్ కుమార్ మాట్లాడుతూ భారత దేశంలోని ప్రజలందరికీ ఎటువంటి భేదాలు లేకుండా అందరికీ సమాంతర న్యాయం అందించాలనే లక్ష్యంతో 1987లో న్యాయ సేవల చట్టం ప్రవేశ పెట్టారని, 1995 నవంబరు 9వ తేదీ నుంచి ఈ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. జాతీయ న్యాయ సేవాధికార మార్గదర్శకాలలో ఉచిత న్యాయ సహాయం పొందడానికి అర్హులుగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారికి, సంవత్సరానికి రూ.లక్ష ఆదాయం లోపు ఉన్న వారిని, మహిళలకు, బాలలకు, యాచకులకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన వారికి, అసంఘటిత కార్మికులకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల న్యాయ సేవ సంస్థల్లో ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహిద్దీన్, పీఎల్‌వీ షేక్ మొహిద్దీన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



పింఛన్ దరఖాస్తును న్యాయసేవాధికార సంస్థ సిబ్బందికి అందజేస్తున్న వృద్ధులు

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

తెనాలిఅర్బన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాలని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి పేర్కొన్నారు. ప్రకాశం రోడ్డులోని ఎస్ఎస్ కంప్యూటర్స్ అకాడమి, జేపీఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అతిథి గ్రాండ్‌లో కంప్యూటర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లతో సమయాన్ని వృధా చేసుకోకుండా ఉండాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు మారాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కంప్యూటర్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.సుబ్రమణ్యం, అకాడమీ డైరెక్టర్ జెట్టి విజయశేఖర్, జెట్టి ఎబినైజర్, ఎ.గిరిధర్, నూతలపాటి నాగేశ్వరరావు, యూ బాలరాజు, షేక్ అబ్దుల్ హకీంజానీ, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఆచార్య కృపాచారి

ప్రతిభా పరీక్షకు ‘మానవత’ ఉచిత శిక్షణ

నేటి నుంచి కుంచవరంలో ఆరంభం

తెనాలి: ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత సంస్థ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు భారత ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శనివారం విలేకరుల సమావేశంలో సంస్థ, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి తెనాలి సమీపంలోని కుంచవరం గ్రామంలో గల మావనత ప్రాంగణంలో ప్రతి ఆదివారం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. దీనితోపాటు సంబంధిత పరీక్ష మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షుడు కటకం ప్రసాద్ మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ పరీక్ష ద్వారా దేశవ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులకు ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్‌ను భారత ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఆదివారం జరిగే శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొనాల్సిందిగా ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. వీరితో సంస్థ కన్వీనర్ తన్నీరు శ్రీనివాసబాబు, ఉపాధ్యక్షుడు పరిమి శ్రీనివాస్, కార్యదర్శి పి.వెంకట్, సంయుక్త కార్యదర్శి డీవీ సోమయ్యశాస్త్రి, డైరెక్టర్ కమిటీ సభ్యుడు చిట్టినేని సాంబశివరావు ఉన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ కొలసాని రామ్‌చంద్

మాయగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా

తెనాలిరూరల్: సినీ వ్యామోహం ఉన్న యువత మాయగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ (మా–ఏపీ) వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా హితవు పలికారు. రూరల్ మండలం పెదరావూరు ఫిలిం స్టూడియోలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుంటూరు, కృష్ణా, ప్రకాశం, ఉభయ గోదావరి జిల్లాల్లో సినిమా అవకాశాల పేరుతో మోసగాళ్లు కొందరు యువకులను డబ్బు అడుగుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. అనుమానం వచ్చిన కొందరు యువకులు విజయవాడ, మైలవరం నుంచి తెనాలిలోని మా–ఏపీ కార్యాలయానికి వచ్చి తనతో నిర్ధారణ కోసం సంప్రదించారని ఆయన తెలిపారు. పైగా ఇటీవల ఓటీటీ ప్లాట్‌ఫాంలు రావటంతో పాపులర్ ఓటీటీకి సినిమా తీస్తున్నట్లు ఆయా మోసగాళ్లు చెప్పడంతో యువకులు ఆకర్షితులై మోసపోతున్నారని, యువత జాగ్రత్తపడాలని సూచించారు.

చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగులకే ప్రజల ప్రశంసలు



ఫిరంగిపురం: చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగులకు ప్రజల నుంచి ప్రశంసలు అందుతాయని ఎస్ఐ వీరనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ ఆడిటోరియంలో ఇటీవల ఏఎస్ఐగా స్థానిక పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కొప్పుల మోహన్‌రావును శనివారం సన్మానించారు. ఎస్ఐలు వీరనారాయణ, సదాశివరావులు మోహన్‌రావుకు పూలమాలలు వేసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35ఏళ్ల సర్వీసులో మోహన్‌రావు అనేకచోట్ల పనిచేసి ఉన్నతాధికారుల మన్ననలు పొందారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు, రైటర్ దాసు, పోలీసు, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు

మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి: కూటమి ప్రభుత్వ పరిపాలనలో రాష్ట్రంలోని బ్రాహ్మణులకు న్యాయం జరుగుతుందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం రాత్రి తెనాలి నాజర్‌పేటలోని విద్యాశంకరభారతి నృసింహసదనంలో వేదిక్ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాహ్మణ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు ఏ.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బ్రాహ్మణ కార్పొరేషన్‌ను త్వరలో ప్రారంభించి, అన్ని విధాలుగా బ్రాహ్మణులను ఆదుకుంటారని చెప్పారు. పట్టణంలో వేదిక బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో నృసింహసదనాన్ని ఏర్పాటు చేయడం, ధార్మిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఏలూరి బ్యాంకు మేనేజర్ ఎన్‌వీఆర్ శేషుకుమార్, సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి, ఏలూరి బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కామరాజు రవి మోహన్, భాగవతుల కామేశ్వరరావు, పుల్లే సూర్యప్రకాష్‌రావు, ఆర్.రాజేంద్రప్రసాద్, టి.దక్షిణామూర్తి, కేవీ సుబ్రహ్మణ్యం, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. తొలుత గాయత్రీ మాత, సరస్వతీదేవి పూజ నిర్వహించారు. పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఒకటి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న 250 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.



విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న మాజీ మ్రంత్రి ఆలపాటి

సైబర్ మోసగాళ్లపై అప్రమత్తత అవసరం

తాడేపల్లి రూరల్: రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలు, మోసగాళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేఎల్‌యూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. సుబ్రహ్మణ్యం సూచించారు. తాడేపల్లి రూరల్‌పరిధిలోని ప్రాతూరులో శనివారం కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సైబర్ నేరాలు జరిగే విధానం, వాటికి గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. ఓటీపీ, కేవైసీ, పెట్టుబడులు, పార్ట్‌టైం జాబ్, డిజిటల్ అరెస్ట్, మొబైల్ సిమ్ అప్‌గ్రేడ్ తదితర మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించామని బీసీఏ విభాగాధిపతి కె. భగవాన్ తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. ఉషారాణి, అధ్యాపకురాలు లక్ష్మీప్రసన్న, వలంటీర్లకు, సహకారం అందించిన ప్రాతూరు గ్రామస్తులకు కేఎల్‌యూ వైస్ చాన్సలర్ జి. పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు ఎ.వి.ఎస్. ప్రసాద్, ఎన్. వెంకట్రామ్, డీన్ స్టూడెంట్ అఫైర్స్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, డీన్ సలహాదారు హబీబుల్లా ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో– ఆర్డినేటర్ పి. శ్రీకాంత్ రెడ్డి తదితరులు అభినందలు తెలిపారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

హెచ్ఐవీ చిన్నారులకు పోషకాహార కిట్ల పంపిణీ

తెనాలి: అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ స్వామి జ్ఞానప్రసన్న పిలుపు ప్రకారం అన్నదాత సుఖీభవ సభ్యుల సహకారంతో శనివారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఆర్‌టీ సెంటర్‌కు మందుల కోసం వచ్చిన హెచ్ఐవీ చిన్నారులకు శనివారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. వీరికి స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్, మానవత సంస్థ, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ భోజన సదుపాయం కల్పించారు. గుంటూరు పట్టణానికి చెందిన అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ స్వామి జ్ఞానప్రసన్న పిలుపునకు పట్టణానికి చెందిన అన్నదాత సుఖీభవ సభ్యులు స్పందించి, చేపట్టిన సేవను డాక్టర్ రామ్‌చంద్ అభినందించారు. శ్రీశివలింగేశ్వర భక్త బృంద సేవాసమితి అధ్యక్షుడు కుర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వామి జ్ఞానప్రసన్న పిలుపునకు స్పందించి అన్నదాత సుఖీభవ సభ్యులు 50 మంది హెచ్ఐవీ చిన్నారులకు శనగలు, కందిపప్పు, రాగిపిండి, గోధుమలు, బెల్లం, బియ్యంతో కూడిన కిట్లను అందజేయటం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు కొత్తగొర్ల శ్రీనివాసరావు, వైద్యాధికారిణి డాక్టర్ రమ్యకృష్ణ, ఏవో స్నేహశ్రీ, మజీద్, జి.మధులత, సీహెచ్ అనూష, కె.సుమలత, మునిపల్లె వెంకట రఘునాధరావు, గుమ్మడి నారాయణ, ధూళిపూడి శ్రీరామమూర్తి, చాగంటి చంద్రశేఖరరెడ్డి, బాణావత్ బాలునాయక్, డొక్కు శ్రీనివాసప్రసాద్, సిఖినం వరప్రతాప్ పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో సిద్ధం చేసిన పోషకాహార కిట్లతో దాతలు, అతిథులు

వరద బాధితుల సహాయనిధి సేకరణ

తాడేపల్లి రూరల్: కేరళలోని వయనాడు వరద బాధితుల్ని ఆదుకునేందుకు రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడులో సహాయనిధిని సేకరించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. కృష్ణయ్య మాట్లాడుతూ ఆల్ ఇండియా కిసాన్ సభ పిలుపు మేరకు వయనాడు వరద బాధితులకు ఆదుకునేందుకు రేవేంద్రపాడులోని హారిక కాలేజీలో విరాళాల సేకరణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అన్నే నవీన్ కుమార్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు, వ్యవసాయ కార్మికుల నాయకులు బాలరాజు, స్థానిక నాయకులు బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి, శంకర్, జేమ్స్ పాల్గొన్నారు.



నిధి సేకరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కేఎల్‌యూలో పూర్వ విద్యార్థుల సందడి

తాడేపల్లి రూరల్: కేఎల్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసి వివిధ దేశాల్లో స్థిరపడిన వారంతా శనివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సంబంధాల విభాగ డైరెక్టర్ కె.సీహెచ్ శ్రీకావ్య కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ జి. పార్థసారథివర్మ మాట్లాడుతూ 2010–2014లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ చదివిన వారి కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. దశాబ్దం తరువాత విద్యార్థులంతా కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రో వైస్ చాన్సలర్ ఎ.వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యాభ్యాసం పూర్తి చేసుకోబోతున్న విద్యార్థులు విదేశాలలో చదువుకోవడానికి పూర్వ విద్యార్థులు మార్గదర్శకత్వాన్ని అందించాలన్నారు. ప్రో వైస్ చాన్సలర్ కె. రాజశేఖర్ మాట్లాడుతూ ఏదో ఒక సందర్భంలో పూర్వ విద్యార్థులు వర్సిటీని సందర్శించి సూచనలను అందించాలని కోరారు. కన్వీనర్ శ్రీకావ్య మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు దేశాల నుంచి పూర్వ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 2019 బ్యాచ్ బీసీఏ విద్యార్థి ఆర్. వంశీకృష్ణ రూపొందించిన దోస్త్ అనే యాప్‌ను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ కె. సుబ్రహ్మణ్యం, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, పరిశోధనా విభాగ డైరెక్టర్ శరత్, కో కన్వీనర్ సోని పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో వీసీ పార్థసారథివర్మ, డైరెక్టర్ శ్రీకావ్య, ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తదితరులు

అలరించిన కూచిపూడి నృత్య నీరాజనం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శనివారం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలు నిర్వహించారు. డాక్టర్ లలిత్ ప్రకాష్‌చంద్ర, డాక్టర్ ప్రవీణ్ నల్లపాటి, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శుభ గాయత్రీ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక నాట్యాచార్యులు బీరక సురేష్ బాబు, శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలి

లక్ష్మీపురం: సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం (సీజీహెచ్ఎస్) వెల్నెస్ సెంటర్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌శాఖ కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఏపీ సెంట్రల్ ఎక్సైజ్ పెన్షనర్ల సంఘం సీజీహెచ్ఎస్ కో– ఆర్డినేటర్ గుమ్మడి సీతారామయ్య చౌదరి కోరారు. కలెక్టరేట్ ఎదురుగా గల సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ శనివారం మంత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీతారామయ్య చౌదరి ఆయన దృష్టికి సమస్యల్ని తీసుకు వచ్చారు.